తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
సోమవారం 21 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8




# బుగ్గ అడవిలో 'కలప' దందా!




వార్తా లోపలి పేజీలో

## విద్యార్థుల భద్రతకు హెచ్‌ఎంలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి

❍ తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలి..
❍ ఐటీడీఏ పీవో బి.రాహుల్




**భద్రాచలం సెప్టెంబరు 20 (జనంసాక్షి)**
తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే గిరిజన విద్యార్థినీ విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. ఈ నెల 22న భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో నిర్వహించనున్న తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సంబంధిత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలోని 10 గురుకుల, 10 ఆశ్రమ పాఠశాలలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 40 ఆశ్రమ పాఠశాలలకు చెందిన 200 మందిలోపు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొననున్నారు. కవితలు, శీర్షికలు, పద్యాలు, ఉపన్యాసాలు, ఒక నిమిషం ఉపన్యాసాలు, ఏకపాత్రాభినయం, నాటికలు తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన అంశాల్లో పాల్గొన్న అనంతరం వారికి భోజనం, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని పాఠశాలల సిబ్బందికి పీవో సూచించారు. కార్యక్రమం పూర్తయ్యాక విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పాఠశాలలకు క్షేమంగా చేరుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## రైతు గోస.. కాంగ్రెస్‌కు గుణపాఠం

❍ కాంగ్రెస్ ప్రభుత్వాని గద్దె దింపే సమయం ఆసన్నమైంది.. మాజీమంత్రి జగదీశ్ రెడ్డి
❍ కరెంటు కోతలతో ఎండిపోయిన వరి పంట పొలాలను పరిశీలించిన జగదీష్ రెడ్డి

**కనగల్లు సెప్టెంబర్ 20 (జనంసాక్షి)**
రైతులను హరిగోశపెట్టిన ప్రభుత్వాలు మనగాడ సాధించిన దాఖలాలు చరిత్రలు లేవని రైతుల ఇబ్బం దులు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపే సమయం ఆసన్నమైందని మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తేల కంటి గూడెం, తిమ్మన్నగూడెం పరిసర ప్రాంతాలలోని కరెంటు కోతలతో ఎండిపోయిన వరి పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలన చేశారు. అనంతరం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ కరెంటు సరఫరాలు ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన పరిస్థితిలే తిరిగి చూస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని గుర్తుచేస్తూ, తెలంగాణ రాష్ట్రంలో మిగులు విద్యుత్తుతో కంటి రెప్ప మాటున కూడా కరెంటు పోకుండా 24 గంటల కరెంటును నిరంతరాయంగా ఇచ్చి రైతాంగాన్ని వార్తా లోపలి పేజీలో



## గణేష్ నిమజ్జనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

❍ డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
❍ దేవరకొండ డి ఎస్ పి శ్రీనివాస్ రావు, గుడిపల్లి ఎస్ ఐ నర్సింహులు



**పి.ఏ.పల్లి, సెప్టెంబర్ 20(జనంసాక్షి):**
గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం,ఁ ంవిన్యూ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు.నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు,భద్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.అజ్మాపురం,గణపురం వద్ద చెరువులు, కుంటలు, ప్రత్యేకంగా గుర్తించిన నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.నిమజ్జన ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, భక్తులు నీటిలోకి వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టనునట్లు,ప్రమాదాల నివారణకు గజ ఈతగాళ్లు,రక్షణ సిబ్బంది,పోలీసు బృందాలను అందుబాటులో ఉంచుతామన్నారు.అత్యవసర పరిస్థితుల్లో

వార్తా లోపలి పేజీలో

## 2,250 మందికి పరీక్ష.. 500 మందికి ఉచిత పోలీస్ శిక్షణ

### ఎస్పీ.శరత్ చంద్ర పవార్



**నల్లగొండ ప్రతినిధి,సెప్టెంబర్ 20, (జనంసాక్షి):**
ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత శిక్షణకు విశేష స్పందన లభించింది. శిక్షణలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ స్క్రీనింగ్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,250 మంది యువతీ యువకులు హాజరయ్యారు.పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల్లో 500 మందిని ఎంపిక చేసి నల్లగొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ అందించనున్నారు. శిక్షణలో సబ్జెక్ట్ నిపుణులతో బోధన, మోడల్ టెస్టులు, పరీక్షల విధానంపై అవగాహన, సందేహాల నివృత్తితో పాటు శారీరక దారుఢ్యానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణకు హాజరై, పట్టుదలతో చదువుతూ శారీరక దృఢత్వంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.పోలీస్ ఉద్యోగం కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశం అని ఎస్పీ పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎంపికైన 500 మంది అభ్యర్థులు పట్టుదలతో శ్రమించి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

# విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**సూర్యాపేట(జనంసాక్షి):** విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని నల్లాల బావి సెంటర్ లో మార్గదర్శి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెలకొల్పిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.రాజకీయాలకు అతీతంగాగణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు.అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు పెండెం చంద్రశేఖర్, నేరెళ్ల లక్ష్మీ, పెద్దిరెడ్డి కళ్యాణ్,ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు నేరెళ్ల మధు గౌడ్, అధ్యక్షులు సలిగంటి శ్రీనివాస్, కార్యదర్శి కారింగుల వేణు, విగ్రహదాత మద్దెల శ్రీనివాస్, అన్నదాతలు, నేరెళ్ల నరేష్, పోలగాని ఉపేందర్, పర్వతం ఉపేంద్రచారి, గుణగంటి మధు, కొండా రాజేష్, పోదీల హరిరాం ప్రసాద్, కృష్ణ,మద్దెల అరవింద్, ఫణి, నేరెళ్ల యతిన్, మిథున్, సాయి కుషాల్, దోరేపల్లి సైదులు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



## మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

**కోదాడ, సెప్టెంబర్ 20(జనంసాక్షి):** మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే ఉద్దేశంతో టీచర్స్ కాలనీలో రెండో వార్షికోత్సవ గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్స్ తోట జ్యోతి శ్రీనివాస్, డాక్టర్ జిల్లేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు. మట్టి గణనాధుని పూజించి పర్యావరణాన్ని కాపాడుతున్నందుకు వారు కమిటీ సభ్యులను అభినందించారు.

## రైతు గోస.. కాంగ్రెస్‌కు గుణపాఠం

కెసిఆర్ ప్రభుత్వం ఆదుకుందని ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కరెంటు సరఫరాలో కోత లేకుండా ఇవ్వడం ఎందుకు చేతకావడం లేదని దద్దమ్మ ప్రభుత్వం దిగిపోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని గుర్తు చేశారు. విద్యుత్ సమస్యలపై ఎక్కడ పాలకులను నిలదీస్తారోనని అసెంబ్లీకి రాకుండా ఏవో కుంటి సాకులతో సస్పెండ్ చేయడం , అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారని. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పండిన కుతంత్రాలు చేసిన రైతులను ఇబ్బంది పెడితే వారికి గోరి కట్టడం ఖాయమన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు గోసపడిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదని చరిత్ర తెలవని వాళ్ళు రాజ్యాలు ఏరుతుంటే ఇలాంటి పరిస్థితిలే దాపురిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరీం పాషా, మండల పార్టీ అధ్యక్షులు అయితగోని యాదయ్య గౌడ్, టిఆర్ఎస్ జిల్లా నాయకులు గోనే రవీందర్రావు, తెలకంటి గూడెం మాజీ సర్పంచ్ బైరగోని వెంకన్న గౌడ్, డి శ్రీనివాస్, మారగాని గణేష్, చెనగోని రామచంద్రం, నల్లబోతు యాదగిరి సుంకిరెడ్డి వెంకటరెడ్డి, బుర్రే శ్రీమన్, మద్రి రేణుక, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలి

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలోని గ్లోబల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నెలకొల్పిన వినాయకుని విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అన్నారు.ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండటం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.సమాజంలో మంచి విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ మోనిషా, మేనేజ్మెంట్ క్రాంతి కుమార్ రెడ్డి, బిక్షపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బి స్మార్ట్ మహిళా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలుగా తీగల జయలక్ష్మి



**భువనగిరి,సెప్టెంబర్ 20(జనంసాక్షి)** బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ప్రెసిడెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్ పర్సన్ తీగల జయలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో వారిని ఏకగ్రీవ ఎన్నుకున్నారు అనంతరం వారికి ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా.పగిడాల జలంధర్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కారానికి బి స్మార్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ,జిల్లా మండల కమిటీకి, వివిధ పాఠశాలల చెందిన కరస్పాండెంట్లకు ధన్యవాదాలు తెలిపారు. వారిని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## గణేష్ నిమజ్జనాలకు పకడ్బందీ ఏర్పాట్లు



వెంటనే స్పందించేందుకు అంబులెన్స్‌లు,ప్రథమ చికిత్స కేంద్రాలు, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని అధికారులు సూచించారు. రద్దీని నియంత్రించేందుకు వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు,పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.గుడిపల్లి ఎస్ ఐ నర్సింహులు మాట్లాడుతూనిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.అధిక శబ్దంతో ప్రజలకు,వృద్ధులకు,చిన్నారులకు ఇబ్బందులు కలిగించే విధంగా సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఊరేగింపుల సమయంలో నిర్ణయించిన మార్గాలను మాత్రమే ఉపయోగించాలని,అనుమతి లేకుండా మార్గాలు మార్చరాదని సూచించారు.

విగ్రహాలను తరలించే సమయంలో ట్రాక్టర్లు, లారీలు,ఇతర వాహనాలపై అధిక సంఖ్యలో భక్తులు ఎక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరారు.విద్యుత్ తీగలు,రహదారి మలుపులు,వంతెనలు,ఇరుకైన ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నారులు,వృద్ధులు,మహిళలు రద్దీ ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలని తెలిపారు.భక్తులు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లకుండా,మొబైల్ ఫోన్లు, నగదు విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు.

నిమజ్జన సమయంలో మద్యం సేవించి పాల్గొనడం,నీటిలోకి దిగి ప్రమాదకరంగా ప్రవర్తించడం,ఈత రాని వారు చెరువులు, కుంటల్లోకి వెళ్లడం పూర్తిగా నిషేధమని అధికారులు తెలిపారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు,రసాయన రంగులు,ప్లాస్టిక్ పూలు,ఇతర వ్యర్థాలను నీటిలో వేయకుండా నిర్ణయించిన ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు.నిమజ్జనం అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు భక్తులు సహకరించాలని కోరారు.

నిర్వాహకులు ముందుగానే పోలీసులకు సమాచారం అందించి,ఊరేగింపు సమయం, మార్గం,వాహనాల వివరాలను తెలియజేయాలని అధికారులు సూచించారు.పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని కోరారు.అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని పోలీసు సిబ్బందిని సంప్రదించాలని,పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.వారి వెంట పోలీస్ శాఖ సిబ్బంది ఉన్నారు.

# బుగ్గ అడవిలో 'కలప' దందా!

- రాత్రయితే చాలు.. గొడ్డళ్ల మోత!
- బోడకొండ?ఆంబోతు తండా కేంద్రంగా కలప వేట?
- వాచర్ 'చీకటి' పాత్రపై ఆరోపణలు.. మర్రిగూడ అధికారుల నిఘా ఎక్కడ?
- గ్రామస్తులే పట్టుకున్న కలప ట్రాక్టర్.. అటవీశాఖకు అప్పగింత

**మర్రిగూడ, సెప్టెంబర్ 20 (జనంసాక్షి)** బుగ్గ అడవిలో కలప దందాపై ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. రాత్రి వేళల్లో విలువైన చెట్లను నరికివేసి కలపను తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టేకు, బూరుగు, మద్ది వంటి చెట్లకు గొడ్డలి వేటు పడుతోందని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 15?20 రోజులుగా ఈ వ్యవహారం సాగుతోందన్న ఆరోపణల మధ్య అటవీశాఖ నిఘాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### గ్రామస్తులే పట్టుకున్న కలప ట్రాక్టర్

అజ్జిలాపురం గ్రామ శివారులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమీపంలో కలప లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను గ్రామస్తులు పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు సమాచారం. మరోవైపు రెండు కలప వాహనాలను గుర్తించగా.. ఒకటి పట్టుబడగా మరో లారీ తప్పించుకుపోయిందన్న సమాచారం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

### బోడకొండ?ఆంబోతు తండా నుంచి కలప రవాణా?

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బోడకొండ, ఆంబోతు తండా పరిసరాలకు చెందిన కొందరు వ్యక్తులు బుగ్గ అడవిలో చెట్ల నరికివేత, కలప తరలింపులో పాల్గొంటున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. పట్టుబడిన వాహనంలోని కలప మూలం, రవాణా మార్గం, గమ్యస్థానంపై దర్యాప్తు చేస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### వాచర్ పాత్రపై 'మామూళ్ల' ఆరోపణలు!

రంగారెడ్డి జిల్లా అటవీశాఖకు చెందిన ఓ వాచర్ కలప అక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అటవీ మార్గాలు, వాహనాల కదలికల సమాచారం ముందుగానే చేరవేస్తున్నారన్న అనుమానాలతో పాటు 'మామూళ్ల' వ్యవహారంపై కూడా స్థానికంగా చర్చ సాగుతోంది. ఆరోపణలపై ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాల్సి ఉంది.

### మర్రిగూడ అటవీశాఖ నిఘా ఎక్కడ?

మర్రిగూడ మండల అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకుండా ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే.. అడవిలో రాత్రివేళల్లో కలప రవాణాపై నిఘా ఎవరు పెడుతున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది.


బీట్ సిబ్బంది గస్తీ ఎక్కడ?

అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు ఎక్కడ?

### గ్రామస్తులకు కనిపించే కలప వాహనాలు

### అటవీశాఖకు ఎందుకు కనిపించడం లేదు?

బుగ్గ అడవిలో కలప నరికివేత, రవాణా ఆరోపణలపై వాచర్ పాత్రతో పాటు బోడకొండ?ఆంబోతు తండా నుంచి జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కలప రవాణా, మర్రిగూడ అటవీశాఖ అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# నల్లగొండ జిల్లాలో 6 వేల వినాయక విగ్రహాల నిమజ్జనం

## నిమజ్జన కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 20,(జనం సాక్షి):** వినాయక ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 6 వేల వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, నిమజ్జన కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి రెవెన్యూ, పోలీస్, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమ, మంగళ, బుధవారాల్లో పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున అన్ని కేంద్రాల వద్ద ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ ఏడాది నీటి వసతి తక్కువగా ఉన్నందున భక్తులు చెరువులు, కుంటలు, నదుల్లోకి నేరుగా దిగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నిమజ్జన కేంద్రాల్లో లైటింగ్, బారికేడింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, క్రేన్లు, వైద్య బృందాలు, సూపర్‌వైజర్లను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు, బేబీ పాండ్లు ఏర్పాటు చేసి విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంచాయతీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విగ్రహాలతో పాటు చెత్తను నీటిలో వేయకుండా నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వేయాలని నిర్వాహకులకు సూచించారు. స్థానిక పోలీసులతో పాటు 12వ బెటాలియన్ పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, ఆపదమిత్ర సేవలను వినియోగించుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.



**28 నిమజ్జన కేంద్రాల గుర్తింపు:**
జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 28 నిమజ్జన ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన పోలీసు బందోబస్తుతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలపై ప్రత్యేక బాధ్యత ఉందన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా సుమారు 500 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు తెలిపారు. ఆదివారం నుంచి బుధవారం వరకు పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున గతంలో కంటే మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి నిమజ్జన కేంద్రంలో బారికేడింగ్, క్రేన్లు, లైటింగ్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కెమెరాలను డివిజన్ స్థాయితో పాటు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు నేరుగా నీటిలోకి వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయకుండా చూడాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గజ ఈతగాళ్ల సహాయంతోనే విగ్రహాలను నీటిలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేయాలని సూచించారు. నిమజ్జనం చేసిన ప్రతి విగ్రహానికి సంబంధించిన పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితర అధికారులు పాల్గొని నిమజ్జన ఏర్పాట్లపై వివరాలు వెల్లడించారు.



## శ్యామల గోపాలన్ AISTA–2026 పోటీలు ఘనంగా కొనసాగింపు

### వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు..

### వయసును, వాతావరణాన్ని లెక్కచేయకుండా క్రీడా స్ఫూర్తితో పోటీలు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 20(జనం సాక్షి):**
పాల్వంచ–కొత్తగూడెం జంట నగరాల వేదికగా శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఐటా?2026 సీనియర్ టెన్నిస్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు తమ వయో పరిమితిని, స్థానిక వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొంటున్నారు. వయస్సు పెరిగినా ఆటపై ఉన్న ఆసక్తి, పట్టుదల తగ్గలేదని పలువురు సీనియర్ క్రీడాకారులు తమ ఆటతీరుతో చాటుతున్నారు. మ్యాచ్‌ల సందర్భంగా క్రీడాకారుల మధ్య పోటీతో పాటు పరస్పర స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. ఇదిలా ఉండ గా, టోర్నమెంట్ నిర్వాహకులు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు అందిస్తున్న ఏర్పాట్లపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి జాతీయ స్థాయి పోటీలను పాల్వంచ–కొత్తగూడెంలో నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

# అటకెక్కిన ప్రజావాణి దరఖాస్తు.. స్పందన కోసం ఎదురుచూపులు

**○ఎక్సైజ్ శాఖకు చేరిన ఫిర్యాదుపై చర్యలేవి..?**

**○దరఖాస్తు ఇచ్చి 20 రోజులు**

**○మండలంలో స్పందన లేకుంటే కలెక్టరేట్‌కే వెళ్లాలా..?**




**జనం సాక్షి, సెప్టెంబర్ 20, సింగరేణి(కారేపల్లి):** ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులపై సకాలంలో స్పందన లభించడం లేదనే విమర్శలు సింగరేణి మండలంలో వినిపిస్తున్నాయి. సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే ఆశతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్న ప్రజలకు దరఖాస్తు స్వీకరించి రసీదు ఇవ్వడంతోనే సరిపెడుతున్నారా..? సంబంధిత శాఖ లకు పంపిన తర్వాత వాటిపై ఏం చర్యలు తీసుకుం టున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మండలంలో మద్యం సిండికేట్ వ్యవహారం, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు, బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై ఆగస్టు 31న మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనికి అధికారులు రసీదు నంబరు 13/2026 జారీ చేశారు. ఫిర్యాదు చేసి 20 రోజులు గడుస్తున్నా ఎక్సైజ్ శాఖ నుంచి తీసుకున్న చర్యలపై స్పష్టత లేదని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు.

**రసీదు ఉంది.. పరిష్కారం ఏది?**
ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరించినట్లు 13/2026 రసీదు సాక్ష్యంగా ఉన్నప్పటికీ, దానిపై ఎక్సైజ్ అధి కారులు క్షేత్రస్థాయిలో ఏం విచారణ చేపట్టారనేది తెలియడం లేదని ఫిర్యాదుదారులు అంటున్నారు. సంబంధిత మద్యం దుకాణాల్లో తనిఖీలు చేశారా..? బెల్ట్‌షాపులకు మద్యం సరఫరాపై విచారించారా..? ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై ఏం తేల్చారు..? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

**ఎక్సైజ్ శాఖ చర్యలేవి..?**
ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదును సంబంధిత ఎక్సైజ్ శాఖ పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వాస్తవం లేదని తేలితే విచారణ వివరాలను ఫిర్యాదుదారుడికి తెలియజేయాలని అంటున్నారు. కానీ 20 రోజులు గడిచినా ఫిర్యాదు ఏ దశలో ఉంది..? ఎవరు విచారణ చేశారు..? ఏం చర్యలు తీసుకున్నారు..? అనే విషయాలపై స్పష్టత లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**దరఖాస్తు తీసుకోవడమే బాధ్యతా..?**
ప్రజావాణిలో దరఖాస్తు తీసుకుని రసీదు ఇవ్వడంతో అధికారుల బాధ్యత పూర్తవుతుందా..? సమస్య పరిష్కారం అయ్యే వరకు దానిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖకు పంపడంతో పాటు నిర్ణీత సమయంలో తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారుడికి తెలియజేసే వ్యవస్థ ఉండాలని కోరుతున్నారు.

**మండలంలో కాకపోతే.. కలెక్టరేట్‌లోనా?**
మండల స్థాయిలో ఇచ్చిన ఫిర్యాదులకే స్పందన రాకపోతే ప్రజలు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి వెళ్లాల్సిందేనా..? అని ప్రశ్నిస్తున్నారు. మండలంలో పరిష్కారం కాకపోతే సమయం, డబ్బు వెచ్చించి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి సామాన్యులకు భారమవుతుందని అంటున్నారు. ప్రజావాణి అంటే కేవలం దరఖాస్తులు స్వీకరించి రసీదులు ఇచ్చే కార్యక్రమంగా కాకుండా సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా ఉండాలని, రసీదు నంబరు 13/2026తో ఆగస్టు 31న ఇచ్చిన ఫిర్యాదుపై ఎక్సైజ్ శాఖ చేపట్టిన చర్యలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

**20 రోజులు.. ఫిర్యాదు ఎక్కడుంది?**
తేదీ: 31-08-2026
రసీదు నంబరు: 13/2026
అంశం: మద్యం సిండికేట్, అక్రమ మద్యం విక్రయాలపై ఫిర్యాదు .ఫిర్యాదు ఇచ్చి 20 రోజులు గడిచినా దానిపై ఏం చర్యలు తీసుకున్నారనే సమాచారం లేదని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. "రసీదు ఇచ్చారు సరే.. పరిష్కారం ఎప్పుడు?" అని ప్రశ్నిస్తున్నారు.






# కన్నుల పండువగా గోదావరి నదీహారతి

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

**భద్రాచలం సెప్టెంబరు 20 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలో గోదావరి నదీహారతి కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోదావరి కరకట్ట వద్ద పురోహితుల మంత్రోచ్చారణలు, భక్తుల శ్రీరామ నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భద్రాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం భక్తుల సహకారంతో గోదావరి మాతకు నదీహారతి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి భద్రాచలానికి వచ్చే భక్తులు నదీహారతిలో పాల్గొని పునీతులవుతున్నారని తెలిపారు. ముందుగా భక్తులకు గోదావరి నదీహారతి విశిష్టతను వివరించి గణపతి పూజ నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన, శ్రీ సీతారామచంద్రస్వామివారికి 12 సార్లు, గోదావరి మాతకు 21 సార్లు హారతులు సమర్పించారు. పురోహితుల శ్రీరామ అష్టోత్తర పఠనం మధ్య భక్తులు 'ఓం శ్రీరామాయ నమః' అంటూ 108 సార్లు శ్రీరామ నామస్మరణ చేశారు. లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరాముడి అనుగ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని రామవజ్జల రవికుమార్ కోరారు. అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సత్యప్రసాద్ శర్మ, రామాచారి, రామ్‌చరణ్ తేజ, తాటిపాముల తిరుపతిరావు, శివ, అశోక్‌కుమార్ శర్మ, రోహిత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

**ప్రతి వీధిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు**

**చంద్రుగొండ గ్రామపంచాయతీ పాలకవర్గం**



**చంద్రుగొండ, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** చంద్రుగొండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా గ్రామపంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సహకారంతో ఆదివారం గ్రామంలోని వివిధ వీధుల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా ప్రతి వీధిలో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తూ పనులను కొనసాగిస్తున్నారు. సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉప సర్పంచ్ అంతటి రామకృష్ణలు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ విద్యుత్ స్తంభాల ఏర్పాటును చేపట్టించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ పాలకవర్గం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, జిల్లా నాయకులు సారేపల్లి శేఖర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేశబోయిన నరసింహారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిన్నంశెట్టి మహేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చాపలమడుగు రాములు, సేవాదళ్ మండల అధ్యక్షులు బుంగ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పంతులు, హసీనా, మండల నాయకులు చాపలమడుగు లక్ష్మణరావు, కళ్యాణి శంకర్, చాపలమడుగు మనోహర్, కడియాల పుల్లయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొని విద్యుత్ స్తంభాల ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు.



# లొద్దిగూడెం గ్రామంలో ఘనంగా గణపతయ్య నిమగ్నం

**గిరిజన గ్రామంలో బొజ్జగణపయ్య లడ్డు11,500లకు పాడిన పాయం మునేష్,కలుశం పాట3316లకు పాడిన మాజీ సర్పంచ్ పాయం నరసింహారావు**

**ఆళ్లపల్లి సెప్టెంబర్ 20(జనంసాక్షి)** మండల కేంద్రంలోని లొద్దిగూడెం గ్రామంలో శ్రీ గణనాథుని నిమగ్నం సందర్భంగా లొద్దిగూడెం గణపతి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం అనంతరం లడ్డు కలుశం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొమరం నరసింహారావు,దొర పాయం రమేష్,పటేల్ కొమరంచంద్రం,మాట్లాడుతూ మా గ్రామంలో ప్రతి సంవత్సరం గణనాథుని నవరాత్రులు చేసుకోవడం వల్ల మా ఊరి ప్రజలకు మంచి జరుగుతుందని తెలిపారు. ఆటపాటలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు ఇవ్వడం వల్ల చిన్నారులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని కొనియాడారు ఈ సంవత్సరం ప్రజలందరూ బాగుండాలని అన్నదాన కార్యక్రమానికి సహకరించిన వారందరికీ లొద్దిగూడెం గ్రామానికి చెందిన శ్రీ బొజ్జ గణపయ్య ఆశీస్సులు ఉండాలని తెలిపారు అనంతరం లడ్డు పాట నిర్వహించగా(11500)రూపాయలకు పాయం మునేష్ కుటుంబ సభ్యులు దక్కించుకోగా,కలశం పాట(3316)లకు మాజీ సర్పంచ్ కొమరం నరసింహారావు దంపతులు కైవసం చేసుకున్నారని తెలిపారు. లడ్డుగూడెం గణపతి కమిటీ సభ్యులు ప్రతి సంవత్సరం ఇ లానేముందుకుతీసుకుపోవాలని కమిటీ సభ్యులందరినీ అభినందించారు.

# గుంతలతో ప్రమాదకరంగా మారిన ఆర్అండ్‌బీ రహదారి

**శ్రమదానం చేసి గుంతలు పూడ్చిన సీపీఎం నాయకులు**



**అశ్వాపురం సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** మొండికుంట నుంచి మల్లెలమడుగు మీదుగా రామ చంద్రాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన ప్రమాదకర గుంతలను సీపీఎం నాయకులు ఆదివారం శ్రమదానం చేసి పూడ్చారు. గొడుగు నాగేశ్వరరావు ఇంటి సమీప ప్రాంతంలో గుంతల కారణంగా బైకులు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో కంకర, సిమెంట్, ఇసుకతో గుంతలను పూడ్చారు. సీపీఎం గ్రామ, మండల నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు స్వర్గం బాలనరసయ్య, దండి రాములు, గొడుగు వెంకన్న, వీర రాఘవులు, బొడ్డు రాములు, బొమ్మరాతి రామయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు బద్దం సమ్మిరెడ్డి, పగడాల అశోక్‌రెడ్డి, తూము వెంకన్న, తునీకేసి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రహదారిపై గుంతలు తాత్కాలికంగా పూడ్చడం కాకుండా ప్రభుత్వం శాశ్వత మరమ్మతులు చేపట్టి రహదారిని అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలోని అంతర్గత రహదారులు కూడా అధ్వానంగా ఉన్నాయని, వర్షాలకు చిత్తడిగా మారుతున్న వాటిని కూడా వెంటనే అభివృద్ధి చేయాలని కోరారు.





# వేలాది దీపాల వెలుగుల్లో మహాలక్ష్మమ్మ కాలనీ భక్తిశ్రద్ధలతో గణపతి దీపోత్సవం

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 20 (జనంసాక్షి)** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మమ్మ కాలనీలో టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, వేలాది దీపాలను వెలిగించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాల వెలుగులతో మహాలక్ష్మమ్మ కాలనీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గణపతిని దర్శించుకున్న భక్తులు విఘ్నాలు తొలగి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయు రారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతి బప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా అంటూ భక్తుల నినాదాలతో కాలనీ మార్మోగింది.

# డాక్టర్ జగదీశ్‌బాబు మృతి తీరని లోటు

**నివాళులర్పించిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ**



**తిరుమలాయపాలెం, (జనంసాక్షి) :** ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కాసుర్తి జగదీశ్‌బాబు అకాల మరణం పేద రోగులకు తీరని లోటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి.వై.పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట వద్ద చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన సజీవ దహనం కావడం తీవ్రగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన జగదీశ్‌బాబు.. సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఉంటూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. విద్యార్థి దశలోనే పీడీఎస్‌యూలో క్రియాశీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. వైద్య పట్టా పొందిన తర్వాత హైదరాబాద్ నిమ్స్‌లో కొన్నాళ్లు సేవలు అందించారని, వివాహానంతరం ఖమ్మంలో స్థిరపడి మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. 'పేదల డాక్టర్'గా పేరొందిన ఆయన, ఎంతోమంది ఆర్తులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సదస్సులలో వక్తగా హాజరై యువతకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. అలాంటి నిస్వార్థ వైద్యుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తూ, ఘనంగా నివాళులర్పించారు.



# గోపాలపురంలో ఘనంగా వినాయక అన్నసంతర్పణ

**స్వామివారి పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం, (జనంసాక్షి) :** నగరంలోని 8వ డివిజన్ గోపాలపురం, ఎల్బీ నగర్‌లో కొలువుదీరిన శ్రీ గణపతి మండపం వద్ద ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారాస నాయకుడు భూక్యా అశోక్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ముందుగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి రాంప్రసాద్, గుండాల కృష్ణా, బచ్చు విజయ్‌కుమార్, గాదే అనిల్, మాటేటి కిరణ్, మోహన్, నరసింహాతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**భర్తకు తీవ్ర గాయాలు, కుమార్తెకు స్వల్ప గాయాలు**



**టేకులపల్లి, సెప్టెంబర్ 20(జనంసాక్షి):** ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలు కుమార్తెకు స్వల్ప గాయాలైన సంఘటన ఇల్లందు కొత్తగూడెం జాతీయ రహదారిపై టేకులపల్లి మండలం సాయన్న పేట వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇల్లందు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గుగులోతు ఉమా (35), మోహన్ తమ కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉమా తీవ్రంగా గాయపడి అక్కడి కక్కడే మృతి చెందింది. ఆమె భర్త మోహన్‌కు తీవ్ర గాయాలు కాగా,కుమార్తెకు స్వల్ప గాయాలయ్యా యి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రి కి తరలించారు. జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై టేకులపల్లి ఎస్సై కే తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## జీడీఎస్ లను 8వ వేతన సంఘంలోకి తీసుకోవాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
జీడీఎస్ లను 8వ వేతన సంఘం పరిధిలోకి తీసుకోవాలి ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ మాజీ జనరల్ సెక్రటరీ ఎస్ఎస్.మహదేవయ్య, ఏఐజీడిఎస్ యు ఆల్ఇండియా ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ లో ఏఐజీడిఎస్ యు సూర్యాపేట డివిజన్ అధ్యక్షులు సిహెచ్.పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఆ సంఘ ఆరవ ద్వైవార్షిక సూర్యాపేట డివిజన్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.దేశవ్యాప్తంగా పనిచేస్తున్న జీడీఎస్ లను పర్మినెంట్ చేసి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు.జీడీఎస్ ల పని వేళలను అధికారికంగా రోజుకు 8 గంటలకు పెంచి, దానికి తగ్గట్టుగా పూర్తి స్థాయి వేతనం అందించాలని అన్నారు.వివిధ రకాల పోస్టల్ పథకాలకు, ఇన్సూరెన్స్ లకు సంబంధించి జీడీఎస్ లకు విధిస్తున్న టార్గెట్లను తగ్గించాలని పేర్కొన్నారు.జీడీఎస్ల సేవా పరిస్థితులపై నియమించిన కమలేష్ చంద్ర కమిటీ నివేదికలోని అన్ని అనుకూల సిఫార్సులను, అలవెన్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆ సంఘ సూర్యాపేట డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.సంఘ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జీ.నాగరాజు, పి.దివ్య, కోశాధికారిగా సీహెచ్. పుల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మిథున్ తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు జీ.శంకరయ్య, కార్యదర్శి బి.జయరాజు, నాయకులు ఏ.శ్రవణ్ కుమార్, వీరారెడ్డి, ఎం.ఆంజనేయులు, వై.పట్టాభిరామయ్య, ఎల్.దామోదర్ రెడ్డి, బాలాజీ, శ్రీనివాస్ గౌడ్, ఖాజా మోహినుద్దీన్, కెఆర్ శర్మ, ఉపేందర్ రెడ్డి, ఎల్లయ్య,నాగరాజు, వెంకటేశ్వర రెడ్డి, ప్రవీణ్,మిథున్,దివ్య, జలాల్,తిరుపతయ్య, బిక్షం,సంఘసూర్యాపేట డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.లింగయ్య, కార్యదర్శి జీ.నాగరాజు, కోశాధికారి ఎం.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ భూముల అంశంపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్

**సూర్యాపేట (జనంసాక్షి):**



22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా చర్చకు రావాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్రెడ్డి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ఈ అంశంపై శాసనసభలో చర్చ జరిగితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ నాయకులు చర్చకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు.మాజీ సీఎం కేసీఆర్ శాసనసభకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు.ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించాల్సిన బాధ్యత ఉందన్నారు.కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూముల విషయంలో సీఎం రేవంత్రెడ్డి శాసనసభలో ప్రస్తావించిన అంశాలపై విచారణ జరపాలని కోరారు.ఎర్రవల్లి ఫామ్హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూములు ఉంటే వాటిని గుర్తించి అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి జగదీశ్రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తులపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు, ప్రజాప్రతినిధులుగా పని చేసిన వారి ఆస్తులు పదవుల్లోకి రాకముందు ఎంత ఉన్నాయి,పదవుల అనంతరం ఎంత పెరిగాయనే అంశంపై విచారణ జరపాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, పేదలకు ప్రయోజనం కలిగేలా చూడాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజా సమస్యలు, భూముల అంశాలపై వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.కోదాడలో జరిగిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందని అన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, సర్పంచ్ భూక్యా రాజు నాయక్, నాయకులు జ్యోతి కరుణాకర్, పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, పాలగాని కృష్ణ, తండు శ్రీనివాస్ గౌడ్, ధర్మ నాయక్, బొప్పని శ్రీకాంత్, కరుణాక రెడ్డి, కుంచం అంజయ్య, పాలకుర్తి వెంకట్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత కక్షలతో హత్యాయత్నం

### బుడమర్లపల్లిలో వ్యక్తిపై దాడి.. పోలీసుల దర్యాప్తు

**కనగల్లు, సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**
మండలంలోని బుడమర్లపల్లి గ్రామంలో వ్యక్తిగత తగాదాలను మనసులో పెట్టుకొనిఒకరిపై హత్యాయత్నం జరిగిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది.

## ఆదిదేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### -మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

**సూర్యాపేట (జనంసాక్షి):**
అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 60ఫీట్ రోడ్డులో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు నాలుగోవ వార్షికోత్సవం సందర్భంగా నెలకొల్పిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.గణపతి నవరాత్రోత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు.ఆదిదేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుణగంటి హేమసతీష్, కాంగ్రెస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ దంతాల సాయినవీన్, దంతాల వీరయ్య, నరేందర్ నాయుడు, అక్కినపల్లి జానయ్య, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు,రేపాల యాదగిరి, జీడిమెట్ల రాంబాబు, విశాల్, భరత్ రెడ్డి, మహేష్, రేవంత్, నితిన్, తన్వి, వెంకట సాయి, రఘు, సాత్విక్, రోహిత్, సాయి, అక్షయ్,నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మడుగులపల్లి ట్రస్ట్రానస్కో సబ్‌స్టేషన్‌లో అక్రమాలు ప్రభుత్వ సొత్తు విక్రయానికి యత్నం?

**○అధికారుల కళ్లుగప్పి చెట్ల నరికివేత ఆన్‌లైన్ ద్వారా రూ. 5,000 అడ్వాన్స్ వసూలు ○ప్రధాన ఛానల్ రిపోర్టర్‌ను అని బెదిరింపులు.. విచారణలో నకిలీ అని తేల్చిన పోలీసులు ○పోలీస్ స్టేషన్‌లో టి యు డబ్ల్యూ జే ఐ జే యు ఆధ్వర్యంలో ఫిర్యాదు దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**మడుగులపల్లి సెప్టెంబర్ 20 (జనం సాక్షి ):**
మడుగులపల్లి మండల కేంద్రంలోని 132/33 కేవీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ట్రస్ట్రానస్కో ) సబ్‌స్టేషన్ పరిధిలో తీవ్ర అక్రమాలు వెలుగుచూశాయి ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన సిబ్బందే, సొంత లాభం కోసం ప్రభుత్వ సొత్తును విక్రయించేందుకు యత్నించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.




**రూ. 5 వేలు అడ్వాన్స్ రెండు ట్రాక్టర్ల కట్టెల బేరం**
గ్రామస్తులు మరియు స్థానిక యువకులు తెలిపిన వివరాల ప్రకారం సబ్‌స్టేషన్‌లో పనిచేస్తూ ప్రస్తుతం వైద్య సెలవు (మెడికల్ లీవ్)లో ఉన్న ఒక ఉద్యోగి, గతంలో నరికి పక్కన పెట్టిన ప్రభుత్వ చెట్ల కట్టెలపై కన్నేశాడు అధికారుల అనుమతి కానీ, ఎలాంటి సమాచారం కానీ లేకుండానే తాను ఈ కార్యాలయ ఉద్యోగినని నమ్మించి, ఓ ప్రైవేటు వ్యక్తికి రెండు ట్రాక్టర్ల కట్టెలను విక్రయించేందుకు బేరం కుదిర్చాడు అందుకోసం సదరు ప్రైవేటు వ్యక్తి నుంచి ఫోన్ పే ద్వారా రూ. 5,000 అడ్వాన్స్ కూడా వసూలు చేసినట్లు ఆధారాలు బయటపడ్డాయి ఈ వ్యవహారం గ్రామంలో ఉన్న యువకులకు తెలియడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

**నకిలీ రిపోర్టర్ అవతారం పోలీస్ స్టేషన్‌లో టి యు డబ్ల్యూ జే ఐ జే యు ఫిర్యాదు!**
ఈ అక్రమ విక్రయంపై పూర్తి వివరాలు సేకరించేం దుకు సబ్‌స్టేషన్‌కు వెళ్లిన స్థానిక విలేకరులను అక్కడ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అడ్డుకున్నాడు నేను కూడా ఒక ప్రధాన టీవీ ఛానల్‌లో పనిచేస్తున్నాను అని చెబుతూ విలేకరులను బెదిరించే యత్నం చేశాడు దీంతో అనుమానం వచ్చిన స్థానిక విలేకరులు పోలీసులను సంప్రదించగా సదరు అటెండర్ ఎలాంటి టీవీ ఛానల్‌లోనూ పనిచేయడం లేదని, ఆయనొక నకిలీ రిపోర్టర్ అని విచారణలో తేలింది. దీంతో టీయూడబ్ల్యూజే ( టి యు డబ్ల్యూ జే ఐ జే యు ) మడుగులపల్లి మండల కమిటీ నాయకులు, విలేకరులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సదరు నకిలీ రిపోర్టర్/అటెండర్‌పై ఫిర్యాదు చేశారు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సదరు వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు.

**బాధ్యులపై శాఖాపరమైన చర్యలు ఏఈ శ్రవణ్**
సబ్‌స్టేషన్ ప్రాంగణంలో జరిగిన చెట్ల నరికివేత, అక్రమ కట్టెల విక్రయం మరియు అడ్వాన్స్ వసూళ్ల వ్యవహారంపై సబ్‌స్టేషన్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఏఈ ) శ్రవణ్‌ను 'పత్రిక' వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న వ్యక్తి వ్యవహారంపై, అలాగే అధికారులకు తెలియకుండా ప్రభుత్వ సొత్తు విక్రయానికి పాల్పడిన బాధ్యులపై శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా వినాయక శోభాయాత్ర

### సతీష్,సురేష్ ఆధ్వర్యంలో శోభాయాత్ర



**మాడుగులపల్లి సెప్టెంబర్ 20( జనంసాక్షి):**
మండల కేంద్రంలో తీగల సతీష్ సురేష్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక వేడుకలో ఆరవ రోజు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర చేపట్టారు. డప్పు చప్పుళ్లు, నృత్యాలతో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ మండల నాయకులు చెరుకుపల్లి రాజు హాజరై వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైదమ్మ,శిరీష,నవ్య కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో విఘ్నాలన్ని తొలగిపోవాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల శ్రీస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరంఅన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం మహాదానమని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నారు.వి ఈ కార్యక్రమంలో శ్రీస్టార్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సందీప్ చౌదరి, మేనేజ్మెంట్ రవి,రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుల సన్నిధిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్

**గుర్రంపోడు సెప్టెంబర్ 20 (జనంసాక్షి)**

గుర్రంపోడు మండల పరిధిలోని కొప్పోలు గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ కాలనీలలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు ఆయా కాలనీల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాశం గోపాల్‌రెడ్డి వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాశం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలతో పాటు గుర్రంపోడు మండల ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. మండలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండి, పంటలు సమృద్ధిగా పండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో రెండో వార్డు మెంబర్ అయితరాజు నాగమణి ప్రసాద్, నాయకులు నాగరాజు, శివ, వేణు, వల్కి శంకర్, కొండల్ తదితరులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు, యువకులు పాల్గొన్నారు.





## అంబేద్కర్ గణేష్ ఉత్సవ సమితి కి 10,000 విరాళం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్

**పి.ఏ.పల్లి, సెప్టెంబర్ 20(జనంసాక్షి) :**

పి.ఏ.పల్లి మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు దేవరకొండ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ నివాసం యందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులకు 10,000 రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఘనపురం శంకర్, అజ్మాపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పేర్ల రవి, ధర్మాపురం కోటేష్, మణిపాల్, అనిల్, సంకటి రాంబాబు, అజయ్, మదన్, నరేష్, అన్వేష్, రాంబాబు, ప్రవీణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

# చండూరులో జర్నలిస్టుపై దాడి

### విధి నిర్వహణలో ఉన్న జనం సాక్షి రిపోర్టర్‌పై వ్యక్తి దౌర్జన్యం

**చండూరు, సెప్టెంబర్ 20 (జనంసాక్షి)**

విధి నిర్వహణలో ఉన్న పత్రికా విలేకరిపై ఓ వ్యక్తి విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చండూరు మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో కారు, బైక్ పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాద విషయం తెలుసుకున్న 'జనం సాక్షి' దినపత్రిక రిపోర్టర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయం అందించే క్రమంలో తెలంగాణ పోలీస్ ఎమర్జెన్సీ నంబర్ 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అనంతరం వార్తా సేకరణ కోసం సంఘటనా స్థలాన్ని తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తుండగా, అక్కడే ఉన్న మొగుదాల దశరథ అనే వ్యక్తి జనం సాక్షి రిపోర్టర్‌పై ఒక్కసారిగా దాడికి దిగాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ... ఫొటోలు ఎందుకు తీస్తున్నావంటూ... రిపోర్టర్‌పై భౌతిక దాడికి పాల్పడ్డాడు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై ఎలాంటి కారణం లేకుండా దాడి చే?చాడు. దాడికి పాల్పడిన మొగుదాల దశరథపై పోలీసులు తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.



# అక్టోబర్ 3న సూర్యాపేటలో ఏఐపీఎస్ఓ జిల్లా మహాసభలు




**సూర్యాపేట (జనంసాక్షి):**

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం సూర్యాపేట జిల్లా మహాసభలను అక్టోబర్ 3న సూర్యాపేటలో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు తొగిటి మురళీ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, హింస, సామ్రాజ్యవాద దాడులు పెరుగుతున్న నేపథ్యంలో శాంతి, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధాల వల్ల ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, ఆయుధ పోటీకి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ సంఘం నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోంద న్నారు. అక్టోబర్ 3న జరిగే జిల్లా మహాసభలకు శాంతి, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు అనంతుల మల్లేశ్వరి, చామల అశోక్ కుమార్, బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం, రాము, పోలోజు రమచారి, బాణాల రాము, గాలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పరెడ్డిగూడెంలో వైభవంగా గణపతి పూజలు

### భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు

**గరిడేపల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):**



పరెడ్డిగూడెంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబటి బాల్‌రెడ్డి సావిత్రమ్మ దంపతులు, లక్కమల్ల రాములు సైదమ్మ దంపతులతో పాటు ఉపేందర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి గ్రామాభివృద్ధి ప్రజలందరి సుఖసంతోషాలు ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ కమిటీ ప్రతినిధులు అనంతు వీరబాబు, నర్సింగ్ బాలకృష్ణ, అనంతు సాయి, నర్సింగ్ విజయ్‌కృష్ణతో పాటు అనంతు వీరబాబు కుటుంబ సభ్యులు, పిల్లలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా యూత్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## బిక్షపతి గౌడ్ మృతికి బీజేపీ నాయకుల నివాళి

**సంస్థాన్ నారాయణపురం. సెప్టెంబర్ 20 ( జనంసాక్షి):**



సంస్థాన్ నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ కొండూరు బిక్షపతి గౌడ్ హార్ట్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో బీజేపీ నారాయణపురం మండల కార్యదర్శి కోడూరు భీరయ్య వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బిక్షపతి గౌడ్ భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి అండగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. బిక్షపతి గౌడ్ మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహా కురుమ, వార్డు మెంబర్ రొమ్ముల సత్తయ్య, బీజేపీ నాయకులు చెరుకుపల్లి సత్తయ్య, చెరుకుపల్లి లింగస్వామి, కందాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటుపై ఎదురుచూపులు

### వివిధ జిల్లాలలో పోలీస్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు

**కోదాడ, సెప్టెంబర్ 20( జనం సాక్షి):**

పోలీస్ కానిస్టేబుల్, మరియు ఎస్ఐ ఉద్యోగాలకు అప్లై చేసుకోవడానికి సెప్టెంబర్ 16న ముగిసింది. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నవంబర్ 29 ఎస్సై అభ్యర్థులకు, డిసెంబర్ 20న కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రిలిమ్స్ రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే సూర్యాపేట జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు ప్రిపరేషన్ లో ఉన్నారు. జిల్లా నుండి నిరుద్యోగులు హైదరాబాదులో వివిధ కోచింగ్ సెంటర్లలో ప్రిపేర్ అవుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న చాలామంది నిరుద్యోగులు వారి తల్లిదండ్రుల ఆర్థిక స్థితి బాగోలేక వేలాది రూపాయలు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో చెల్లించలేక ఇంటి దగ్గర ఉండి స్థానిక లైబ్రరీలో ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. అభ్యర్థులు ఫిజికల్ ఈవెంట్స్, ట్రైనర్ లేకుండానే ప్రాక్టీస్ చేస్తున్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం, లేదా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ రిక్రూట్మెంట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తే బాగుంటుందని నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని జిల్లాలలో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు



చేశారు. స్క్రీనింగ్ టెస్ట్ ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఉచిత శిక్షణ, భోజన వసతి, కోచింగ్ ఏర్పాటు చేశారు. సూర్యాపేట జిల్లాలో కూడా ఉచిత శిక్షణ, శిబిరాన్ని ఏర్పాటు చేయాలని నిరుద్యోగ యువతీ యువకులు కోరుతున్నారు.

# పి ఆర్ జి టి ఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఏర్పాటు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):**
ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (ఖఫీఉం) ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల సొసైటీలకు చెందిన ఉపాధ్యాయులతో జిల్లా కమిటీ నిర్మాణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మంది సభ్యులతో పి ఆర్ జి టి ఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా కమిటీ అధ్యక్షులుగా కొప్పుల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నల్లమల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దాసరి సరిత, గౌరవ అధ్యక్షులుగా గంగావతి వెంకటేష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా కె. మేరీ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాలాజీ, వి. గోపి, ఎ. బాషాలను ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. అన్ని గురుకుల సొసైటీల ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ




వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ జి టి ఏ ఆధ్వర్యంలో నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పి ఆర్ జి టి ఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గురుకుల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ జి టి ఏ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గురుకుల వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి ఉమ్మడి గురుకులాల కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు, 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు, హెల్త్



కార్డుల జారీ, కేర్‌టేకర్ల నియామకం వంటి ప్రధాన అంశాలపై సంఘం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. నూతన జిల్లా కమిటీ ఏర్పాటుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను సమర్ధవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు మరింత బలోపేతంగా పనిచేస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పి ఆర్ జి టి ఏ రాష్ట్ర నాయకులు గుర్రం రమేష్ గౌడ్, నిర్మలానందం, ఉప్పు అశోక్, రామకృష్ణారెడ్డి, కమటం నాగేశ్వరరావు, పానుగంటి విజయ్, లక్ష్మారెడ్డి,సంజీవరెడ్డి,పగుడాల నరసింహ,జానకి రాములు తెలిపారు.



## పిఆర్ జిటిఏ జిల్లా కమిటీ ఏర్పాటు

### గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం..

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 20 (జనంసాక్షి)**
ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పిఆర్ జిటిఏ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీని 24 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల సొసైటీలకు చెందిన ఉపాధ్యాయులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొప్పుల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నల్లమల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎం. శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దాసరి సరిత, గౌరవ అధ్యక్షుడిగా గంగావతి వెంకటేష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా కె. మేరీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పిఆర్ జిటిఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు, 010 పద్దు ద్వారా జీతాలు, హెల్త్ కార్డులు, కేర్‌టేకర్ల నియామకం వంటి ప్రధాన డిమాండ్లపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. నూతన జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గురుకుల సొసైటీల ఉపాధ్యాయులను సమన్వయం చేసి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుర్రం రమేష్‌గౌడ్, నిర్మలానందం, ఉప్పు అశోక్, రామకృష్ణా రెడ్డి, కమటం నాగేశ్వరరావు, పానుగంటి విజయ్, లక్ష్మా రెడ్డి, సంజీవరెడ్డి, పగుడాల నరసింహ, జానకిరాములు పాల్గొన్నారు.

## గణనాధుని అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి

### దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 20 (జనంసాక్షి ):**
గణనాధుని అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం గుడిపల్లి మండలం ఘనపురం గ్రామంలోని బృందావనం కాలనీ యూత్ మరియు కమ్యూనిటీ హాల్‌లో కొలువుదీరిన మహా గణేశుడిని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ విఘ్నాలను తొలగించి విజయాలను అందించే విఘ్నేశ్వరుడి అనుగ్రహం ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్,నేనావత్ కిషన్ నాయక్,ఉమ్మడి మండల పార్టీ అధ్యక్షులు వల్లపు రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రెటినేని ముత్యపు రావు,సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,ఆడెపు నగేష్,రాయనబోయిన శ్రీను,రమావత్ కిషన్ నాయక్,మాజీ మండల ప్రధాన కార్యదర్శి తోటకూరి పరమేష్,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు మునగాల అంజిరెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి,బొడ్డుపల్లి మహేందర్,అర్వపల్లి నర్సింహా,గోలి గిరి,మాద సుధాకర్ గౌడ్,రమావత్ శ్రీను,వీరమోని అంజి గౌడ్,పొట్ట మురళి,వెంకన్న, కస్తూరి యాదయ్య,నేనావత్ నాగార్జున నాయక్, కొండల్,నాగరాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## బుచ్చమ్మ మృతి బాధాకరం

### ఎమ్ ఆర్ పి ఎస్ మండల అధ్యక్షుడు ఆడెపు సతీష్

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 20(జనంసాక్షి) :**
పి.ఏ.పల్లి మండలం అజ్మాపురం గ్రామానికి చెందిన కంబాలపల్లి బుచ్చమ్మ మృతి బాధాకరమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆడెపు సతీష్ అన్నారు.ఆదివారం నాడు ఎమ్మార్పీఎస్ కమిటీ నాయకులతో కలిసి ఆయన బుచ్చమ్మ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఆయన వెంట మాజీ సర్పంచ్ ఆదిరాల నగేష్,ఉప సర్పంచ్ ఆంజనేయులు,బిజెపి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొతేం కర్ణాకర్,ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిమడుగు సాయి,చిరంజీవి,గోవర్ధన్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.



## మర్రిగూడ లో మహిళ అదృశ్యం..

### ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**మర్రిగూడ, సెప్టెంబర్ 20 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన తోకల లక్ష్మి (34), భర్త యాదయ్య అదృశ్యమైనట్లు మర్రిగూడ పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 19న ఇంట్లో కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లిన లక్ష్మి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.ఈ విషయంపై ఆమె భర్త మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.లక్ష్మిని ఎక్కడైనా చూసిన వారు, ఆమె ఆచూకీ తెలిసిన వారు లేదా ఆమెకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉన్నవారు వెంటనే మర్రిగూడ ఎస్ఐకు 8712670231 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



### వినాయక మండపం వనితక్లబ్ ఆధ్వర్యంలో

## సహస్ర విష్ణు పారాయణం పఠనం

**హలియా సెప్టెంబర్ 20 జనంసాక్షి**
హాలియా సాగర్ రోడ్ లో ఆర్యవైశ్య సంఘం కిరాణా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద నవరాత్రుల్లో భాగంగా వనిత క్లబ్ అధ్యక్షురాలు నిర్మల దేవివెంకటేశం ఆధ్వర్యంలో మహిళా భక్తులు. సహస్ర విష్ణ పారాయణ భక్తిశ్రద్ధలతోపఠించినారు . పారాయణలో పాల్గొన్న మహిళా భక్తులకు డ్రా ద్వారా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం గణపతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో హ లియా కిరాణం జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిపోలు శ్రీనివాసులు. పాంపాటి వెంకటేశం కొండూరు వెంకటేశ్వర్లు మంచుకొండ ప్రభాకర్ పోలా సైదులు చీద ళ్ళ లింగయ్య వీరమళ్ళ కృష్ణయ్య ఊర వేణు గార్లపాటి శోభా ఉషారాణి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఈదమ్మ తల్లి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలి

### దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 20(జనంసాక్షి):**
ప్రతి ఒక్కరూ ఈదమ్మ తల్లి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం పి.ఏ.పల్లి మండలం వద్దిపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఈదమ్మ తల్లి దేవాలయంలో రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు.దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు.వద్దిపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి దేవాలయ ప్రాంగణం నిత్యం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరికీ ఈదమ్మ తల్లి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేతావత్ భీల్యా నాయక్, నేనావత్ కిషన్ నాయక్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు యెల్గురి వల్లపు రెడ్డి,స్థానిక సర్పంచ్ రాయనబోయిన శ్రీను,రేటినేని ముత్యపు రావు,మాజీ మండల ప్రధాన కార్యదర్శి పరమేష్, గుడిపల్లి సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,దుగ్యాల సర్పంచ్ నగేష్, పడమటితండ సర్పంచ్ రమావత్ కిషన్ నాయక్,అర్వపల్లి నర్సింహ, మాద సుధాకర్ గౌడ్,బొడ్డుపల్లి మహేందర్,గోలి గిరి,శ్రీను నాయక్, బీఆర్ఎస్‌పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## అఖిలభారత రైతు కూలీ సంఘం గోడపత్రిక ఆవిష్కరణ

**గరిడేపల్లి, సెప్టెంబర్ 20(జనం సాక్షి):**
వెలిదండ గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభల గోడ పత్రికలను శనివారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో ఖమ్మం లో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘండివిజన్ కార్యదర్శి మేకల కనకారావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు 16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం, రైతుల సబ్సిడీలను రద్దు చేసిందని ఆరోపించారు. యూరియా యాప్ ను రద్దు చేసి రైతులకు సకాలంలో యూరియా అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన రైతు బీమాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చిన్నగాని పెద్ద సాంబయ్య, నాయకులు తాళ్లూరి చిన్న సూర్యం, చెనగాని లక్ష్మయ్య, గండు రాంబాబు, గండు మల్లయ్య, మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య, వల్లపు దాసు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గొండ్వానా రాష్ట్రం ఏర్పాటుతోనే ఆదివాసుల సమగ్ర అభివృద్ధి

❍ భూమి, అడవి, నీరు, ఉద్యోగాలు, నిధులపై ఆదివాసులకు హక్కులు కల్పించాలి

❍ దాట్ల నాగేశ్వరరావు



భద్రాచలం సెప్టెంబరు 20 (జనంసాక్షి) ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసుల భూములు, అడవులు, నీటి వనరులు, సంస్కృతి, ఉపాధి అవకాశాలను పరిరక్షిస్తూ సమగ్ర అభివృద్ధి సాధించాలంటే ప్రత్యేక గొండ్వానా రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90 జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. భద్రాచలంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో దాట్ల నాగేశ్వరరావు మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) కింద ఐదో షెడ్యూల్ ప్రాంతాలకు ప్రత్యేక పరిపాలనా నిబంధనలు ఉన్నాయని తెలిపారు. తరతరాలుగా ఆదివాసులు సాగు చేస్తున్న భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. భూ బదలాయింపులు, ఆక్రమణలు, భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అన్నారు.

**- స్థానిక యువతకు ఉద్యోగ ప్రాధాన్యం**

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసి నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక నియామక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో స్థానిక ఆదివాసి యువతకు ప్రాధాన్యం కల్పించే విధానం అవసరమన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లోని నదులు, వాగులు, ఇతర జల వనరులను స్థానిక ప్రాంతాల అభివృద్ధికి వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల వినియోగం ఉండాలని సూచించారు.

**- సంక్షేమ నిధులపై శ్వేతపత్రం ఇవ్వాలి..**

ఆదివాసుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులు ఎంత? ఏ పథకాలకు ఎంత ఖర్చు చేస్తున్నారు? ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? షెడ్యూల్ ప్రాంతాల్లో మౌలిక వసతులకు ఎంత నిధులు వినియోగించారు? అనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా నివసిస్తున్న వారికి ధ్రువీకరణ పత్రాలు గత 30 ఏళ్లుగా షెడ్యూల్ తెగలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న వలస ఆదివాసులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కుల ధ్రువీకరణ పత్రాలు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేక గొండ్వానా రాష్ట్రం కోసం ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. భూమి, అడవి, నీరు, ఉద్యోగం, విద్య, సంస్కృతి, స్వయం పరిపాలన హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసులు ఐక్యంగా తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**- తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎన్నిక**

సమావేశం అనంతరం ఆదివాసి సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉయిక శంకర్ ఎన్నిక కాగా, కార్యవర్గ సభ్యులుగా సున్నం రాము, పాయం రమేష్, పొట్ట శివాజీ, కొండ్రు శ్రావణ్, ఉకే నాగేశ్వరరావు, ఇరపరాజు ఎన్నికయ్యారు.



**సరస్వతీ పూజలో ముఖ్య అతిథిగా చింతనిప్పు కృష్ణచైతన్య**

ఖమ్మం, (జనంసాక్షి) : శ్రీ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ, చెర్వుబజార్ 41వ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం సరస్వతీ పూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారధి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చింతనిప్పు కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరై సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు కృష్ణచైతన్యకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

**మంటలను అదుపులోకి తెచ్చిన జువారి అగ్నిమాక బృందం**



చింతలపాలెం(జనంసాక్షి) దొండపాడు గ్రామం నుండి ట్రాక్టర్‌లో వజినేపల్లి గ్రామ సమీపంలో ఎండు వరిగడ్డిని తరలిస్తుండగా,విద్యుత్ తీగ తగిలి షార్ట్ సర్క్యూట్ కారణంగా వరిగడ్డికి మంటలు అంటుకు కొని అగ్ని ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదం ఒక కోళ్ల ఫారమ్ కు చాలా దగ్గరగా జరగడంతో, మంటలు మరింత విస్తరించే ప్రమాదం ఏర్పడింది.సమాచా రం అందిన వెంటనే,అగ్నిమాపక బృందం(జువారి సిమెంట్ లిమిటె డ్)సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక చర్యలు చేపట్టింది.నీటిని ఉపయోగించి మంటలను త్వరగా అదుపులోకి తెచ్చారు,ఎటువంటి అదనపు ప్రమాదం లేదా సమీప ఆస్తుల కు నష్టం వాటిల్లకుండా మంటలను పూర్తిగా ఆర్పారు.సంబంధిత సిబ్బంది మరియు స్థానిక నివాసితుల సమక్షంలో ఈ అగ్నిమాపక యి.మంటలు పూర్తిగా నియంత్రణ చర్యలు నిర్వహించబడ్డా ఆరిపోయే వరకు మరియు ప్రభావిత ప్రాంతం పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు.వెంటనే స్పందించి మంటలను అదుపు చేసినందుకు స్థానికులు జువారి సిమెంట్ అగ్నిమాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పాల్వంచ వద్ద ఘోర ట్రాక్టర్ ప్రమాదం యువకుడు మృతి

పాల్వంచ (రూరల్): సెప్టెంబర్ 20 (జనంసాక్షి)పాల్వంచ మండల పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ఘోర ట్రాక్టర్ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బూర్గంపాడు మండలం దబ్బతోక గ్రామానికి చెందిన సున్నం శివాజీ (25) సీతారామసాగర్ ప్రాజెక్టులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సెప్టెంబర్ 20న ఉదయం సుమారు 5.00 గంటలకు పాల్వంచలోని శివానగర్ నుంచి తన అన్న సున్నం శ్రీకాంత్‌కు చెందిన ట్రాక్టర్ (TG 28 CTR 0473)ను తీసుకుని ఊరికి బయలుదేరాడు.ఉదయం 6.00 గంటల ప్రాంతంలో పాండురంగాపురం గ్రామం చివరకు చేరుకోగానే, ట్రాక్టర్‌ను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల అదుపుతప్పింది. దీంతో శివాజీ ట్రాక్టర్ పైనుంచి కిందపడగా, ట్రాక్టర్ టైరు అతడి పైనుంచి వెళ్లి అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో శివాజీ తీవ్రంగా గాయపడ్డాడు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు (తాటి విజయ్, సోలం సారయ్య) వెంటనే స్పందించి, తీవ్రంగా గాయపడిన శివాజీని బైక్‌పై పాల్వంచలోని శిరీష ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అతడు మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ధృవీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి శవపరీక్ష గదికి తరలించారు. మృతుడి అన్న సున్నం శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం ఐటీడీఏ ముట్టడి

❍జీవో నం.3 పునరుద్ధరణ.. 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

❍1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : కుంజా వెంకటేష్ దొర

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) ఆదివాసీల హక్కుల పరిరక్షణతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నేడు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు అన్నపురెడ్డిపల్లి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర తెలిపారు. తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, భూములు, ఉద్యోగ అవకాశాల పరిరక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు కొట్టివేసిన జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ నిరుద్యోగులకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలకు సంబంధించిన నోటిఫికేషన్లను ఐటీడీఏల ద్వారానే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఆదివాసీయేతరుల



చొరబాటుతో ఆదివాసీల భూములు, ఉద్యోగ అవకాశాలకు నష్టం జరుగుతోందని, ఈ అంశాలపై ప్రభుత్వం మౌనం వీడేలా చర్యలు చేపట్టాలని కోరారు.

**అధిక సంఖ్యలో తరలిరావాలి**

మండలంలోని ప్రతి ఆదివాసీ గూడెం నుంచి యువత, మేధావులు, మహిళలు, నిరుద్యోగులు, వివిధ ఆదివాసీ ఉద్యమ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వద్ద జరిగే ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుంజా వెంకటేష్ దొర పిలుపునిచ్చారు.

**గణేష్ చౌరస్తాలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు**



సూర్యాపేట (జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని 33వ వార్డు గణేష్ చౌరస్తాలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వరలక్ష్మి పూజలో మహిళలు పాల్గొన్నారు.వినాయకుని లడ్డును సుధాకర్ రూ.40 వేలు, కలశాన్ని కృష్ణారెడ్డి రూ.20వేలు, అమ్మవారి చీరను రూ.7 వేలకు మోదుగు జానకమ్మ దక్కించుకున్నారు. అన్నదాన కార్యక్రమం దాతలు డాక్టర్ సునీల్ కుమార్ రాధిక, కొమ్ము వెంకటరెడ్డి రమ దంపతులు, విగ్రహ దాత గొట్టిముక్కుల శ్రీనివాసరెడ్డి కళావతి దంపతులు పూజలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగుల వాసు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెద్దిరెడ్డి రాజా మాట్లాడుతూ గణేష్ నగర్ చౌరస్తా విద్యానగర్ వాడకట్టు నందు గత 18 సంవత్సరాల నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.వినాయకుని దయవల్ల ఈ సంవత్సరం వర్షాలు పడి ఎల్ ని నో ప్రభావం తొలగిపోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఇండ్ల ధనమూర్తి, పుప్పల శ్రవణ్ కుమార్, వీరబ్రహ్మచారి, పెద్దిరెడ్డి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

**భక్తి పారవశ్యంలో హైటెక్ సిటీ..**

# ఘనంగా గణనాథుని పూజలు



ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి : మండలం లో ని కొరటికల్ గ్రామం లో ని హైటెక్ సిటీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.గణనాథునికి పుష్పాలంకరణ చేసి, వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పరిసర ప్రాంతాల్లో భక్తి వాతావరణం నెలకొంది.

# యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

## రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఖలీద్ అహ్మద్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి)**

ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఖలీద్ అహ్మద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం అర్బన్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ భూక్య వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ సంస్థాగత కార్యక్రమాలు, యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, మండలాలు, గ్రామాలు, బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై స్థానిక సమస్యలను గుర్తించి వాటిపై ప్రజా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు.

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఖలీద్ అహ్మద్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, పార్టీ సంస్థాగత నిర్మాణంలో యువజన కాంగ్రెస్‌కు కీలక బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. యువ నాయకులు క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఖమ్మం అర్బన్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ భూక్య వెంకటేష్ మాట్లాడుతూ యువతను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ యూత్ కాంగ్రెస్‌ను మరింత క్రియాశీలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని సంస్థాగత అంశాలపై చర్చించారు.




# సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్

**టేకులపల్లి, సెప్టెంబర్ 20(జనంసాక్షి):**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జీఎం వి.కృష్ణయ్య ఆదేశానుసారం ఆదివారం హైటెక్ కాలనీ టేకులపల్లి లో గల సి.ఇ.ఆర్ క్లబ్ నందు ఏరియా సింగరేణి అధికారులకు యం.బి. ఉయం.సి క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ లో ఫ్రెష్ ఎలాట్ మెంట్,చేంజ్ ఆఫ్ క్వార్టర్ కొరకు దరఖాస్తు చేసుకు న్న అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు. ఈ సందర్భముగా ఎస్ ఓ టు జీఎం జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ హాజరై అర్హత కలిగిన వారికి క్వార్టర్ అలాట్మెంట్ ఉత్తర్వులు జారిచేయ బడతాయని, అలాగే క్వార్టర్ ఎలాట్ మెంట్ కమిటీ వారు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా నిబందనలకు అనుగుణంగా క్వార్టర్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిజియం (పర్సనల్) అజ్మీర తుకారాం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి.సుధాకర్, క్లర్క్ జి. వీరన్న, సెక్యూరిటీ గార్డ్ తిరుపతి, ఉద్యోగులు పాల్గొన్నారు.





# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు పిలుపు

## శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదానం

**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 20 (జనం సాక్షి)**

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు బంధంపల్లి ఉమ్మడి గ్రామపంచాయతీలోని శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం దగ్గర మహా అన్న ప్రసాద వితరణ మహాగణపతి ఉత్సవాల భాగంగా గణపతి మండపం దగ్గర ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి,విఘ్నేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీఆధ్వర్యంలో గణనాథుడిని దర్శించుకొని,కొబ్బరికాయ కొట్టి,ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామి వారి ఆశీస్సులను పొందారు. శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ...మట్టి గణపతిని ఏర్పాటు చేసి మహా అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించి ఈ కార్యక్రమంలో భారీగా భక్తులు సుమారు 1000 మంది పాల్గొని ఉంటారని తెలియజేశారు,వినాయక చవితి పర్వదినం ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించాలని ఆకాంక్షించారు.. ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, అభివృద్ధి వెల్లివిరియాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు..ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు.. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్టించాలి. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని పూజించాలి పర్యావరణాన్ని కాపాడాలి అని తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో,పాడిపంటలతో సుఖ సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ గ్రహదాత రావుల ఉపేందర్ రెడ్డి స్వాతి రెడ్డి వాటర్ దాత గుండా శ్రీనివాస్ రెడ్డి టెంట్ హౌస్ దాత కమటం లక్ష్మణ్ వినాయక లడ్డు దాత బండార అశోక్ రెడ్డిఈ కార్యక్రమంలో శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ,యూత్ సభ్యులు , వివిధ గ్రామాల భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలి

- రేపు భద్రాచలంలో గిరిజన దర్బార్, ప్రజావాణి..
- ఐటీడీఏ పీవో బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట





**భద్రాచలం సెప్టెంబరు 20 (జనంసాక్షి)**

గిరిజనులు, ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట సూచించారు. సోమవారం (సెప్టెంబరు 21) భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఆయా కార్యాలయాల సమావేశ మందిరాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని పీవో, సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.

# ఖమ్మంలో విన్ విజన్ కంటి ఆసుపత్రి ప్రారంభం

## అత్యాధునిక వైద్య సేవలకు శ్రీకారం.. ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల, ఎంపీ రఘురామరెడ్డి

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి)**

ఖమ్మం పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన విన్ విజన్ కంటి ఐహాస్పిటల్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హాస్పిటల్ మేనేజ్మెంట్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఖమ్మం జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని మంత్రి తుమ్మల కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి, నాగళ్ళ దీపక్ చౌదరి తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

